క్లుప్తంగా

గౌతమబుద్ధ అవార్డు అందుకున్న డాక్టర్ కిషోర్



కిషోర్‌కు అవార్డు అందజేస్తున్న కొమ్మినేని తదితరులు

వైరా: వైరాకు చెందిన ఆస్ట్రాలజర్, న్యూమరాలజిస్ట్ డాక్టర్ గుండు హరికిషోర్‌గౌడ్ గౌతమ బుద్ధ అవార్డు అందుకున్నారు. పీలాంత్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ఆయనకు విజయవాడలో శుక్రవారం అవార్డు అందించి సన్మానం చేశారు. ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుతో పాటు అద్దంకి రాజా, సత్యగౌడ్, తొడుపు సూరి పాల్గొన్నారు.

బుక్ బ్యాంక్ ఏర్పాటు

మధిర: నూతన విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థికి ప్రారంభంలోనే పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా మధిర పట్టణంలోని సీపీఎస్ పాఠశాలలో బుక్ బ్యాంకును ఏర్పాటు చేశారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ప్రభు దయాళ్ ఆధ్వర్యంలో విద్యార్థుల పరీక్షలు పూర్తైన తర్వాత వారి నుంచి పాత పాఠ్య పుస్తకాలను సేకరించారు. వాటిని పాఠశాలలో బుక్ బ్యాంకులో నిల్వ చేసి వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలో చేరనున్న విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని హెచ్ఎం తెలిపారు.

బీటెక్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: ఇంజనీరింగ్ మూడో సంవత్సరం ఫైనల్ పరీక్ష ఫలితాల్లో గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ డాక్టర్ శేషరత్నకుమారి తెలిపారు. ట్రిపుల్‌ఈలో ప్రకాష్, హరికృష్ణ, వీరబాబు, మెకానికల్ విభాగంలో నరేంద్ర, వినోద్, ఈసీఈలో త్రివేణి, అనూష, నీరజ, నాగవర్మ, సీఎస్ఈలో సింధు, తేజస్విని, ఆర్తి, సీఎస్ఎంలో సూర్యనారాయణ, మానస, భావన అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను రాజ్యసభ సభ్యుడు, కళాశాల చైర్మన్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద్, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, చీఫ్ కౌన్సిలర్ జవహర్, విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

18న మైనార్టీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక

ఎర్రుపాలెం: మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ సంస్థ యాక్షన్ ప్లాన్ ప్రకారం 2022–23 సంవత్సరానికి గానూ ఆరుగురికి రుణాలను పంపిణీ చేసేందుకు లబ్ధిదారులను ఈ నెల 18న ఉదయం 11గంటలకు మండలకేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో లాటరీ తీస్తామని ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఆరుగురిని 4 యూనిట్లు పురుషులకు, రెండు యూనిట్లు మహిళలకు ఎంపిక చేస్తామని, ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.1 లక్ష రుణాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న అర్హులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బాధితులకు సీపీఎం నాయకుల పరామర్శ

కారేపల్లి: చీమలపాడు ఘటనలో మృతిచెందిన బాధిత కుటుంబాలను సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు శనివారం పరామర్శించారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు భూక్యా వీరభద్రం నాయక్, దుగ్గి కృష్ణ, కె.నాగేశ్వరరావు, కె.నరేందర్, వజ్జా రామారావు, సైదులు, భద్రయ్య, నాగయ్య, కొండల్‌రావు, సంతూ, రమేష్, వీరస్వామి, సర్వయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఉద్యోగి మృతి

పెనుబల్లి : కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పెనుబల్లి మండలం లంకపల్లి సర్కిల్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న లక్ష్మీకాంతం(45) ఖమ్మంలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. గత 15 రోజుల క్రితం అనారోగ్యంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం ఆమె మృతి చెందారు.

రేషన్ డీలర్ల భర్తీకి నేడు పరీక్ష

కల్లూరు: రెవెన్యూ డివిజన్ పరిధిలోని కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాల్లో 19 మంది రేషన్ డీలర్ల ఎంపికకు ఆదివారం రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ సూర్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 11నుంచి 12. 30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. వీడియో నిఘా మధ్య పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశామని, దరకాస్తు చేసుకున్న అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నోరూరించేలా.. ఆకలి తీర్చేలా!

- రంజాన్ మాసంలో ప్రత్యేకం.. గంజి
- ఉపవాస దీక్షాపరుల కోసం తయారీ
- మసీదుల వద్ద ఘుమఘుమలాడే వంటకం..



గంజి తయారు చేస్తున్న దృశ్యం



ఉపవాస దీక్షల అనంతరం గంజిని సేవిస్తున్న ముస్లింలు

సండే స్పెషల్

సత్తుపల్లి: రంజాన్ మాసం వచ్చిందంటే చాలు.. మసీదుల్లో ప్రత్యేకమైన గంజిని తయారు చేస్తారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్న పానియాలు లేకుండా దైవారాధనలో గడిపే ఉపవాసపరులకు ఇఫ్తార్ వేళ కడుపునిండ అన్నం పెట్టలేకపోయినా కనీసం బలవర్ధకమైన ఆహారం ఏదైనా అందించాలనే తలంపుతో గంజిని తయారు చేస్తారు. ఈ వంటకం చాలా ప్రత్యేకమైనది. హలీమ్‌ను తినేందుకు ఎంతగా ఇష్టపడతారో.. గరం గరం గంజిని సేవించేందుకు కూడా అంతే ఇష్టం చూపిస్తారు. ఉపవాస దీక్ష సమయంలో ద్రవపదార్థామైన వేడివేడి గంజి(జావ)ను తాగితే మంచిదని భావిస్తారు. ప్రతి ఏటా రంజాన్‌మాసంలో జిల్లాలోని మసీదుల్లో ఈ పసందైన ఘుమ.. ఘుమ లాడే వంటకాన్ని మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తయారు చేస్తారు. ఉపవాస దీక్షాపరులకు ఈ గంజిని సేవిస్తే బడిలిక తీరుతుంది. దీక్ష విరమించే సమయంలో ముస్లింలు దీనిని సేవిస్తారు. అదేవిధంగా ముస్లిమేతరులు కూడా గంజిని ఇంటికి తీసుకెళ్లి రుచులను ఆస్వాధిస్తారు. వేడివేడి గంజిలో బూందీని కలుపుకొని సేవిస్తే ఆ రుచి అద్భుతుంగా ఉంటుంది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో సత్తుపల్లి, అశ్వారావుపేట, భద్రాచలం, మధిర, వైరా, కొత్తగూడెం నియోజకవర్గాలలో గంజిని తయారు చేసేందుకు యువకులు శ్రమిస్తుంటారు.

గంజి తయారీలో..

మసీదులలో ఉపవాసదీక్ష పరుల కోసం గంజి (జావ)ని తయారు చేస్తారు. బియ్యం రవ్వ, టమాట, ఉల్లిగడ్డ, క్యారెట్, కొత్తిమీర, పచ్చిమిర్చి, మంచినూనే, పప్పు, ప్రత్యేక మసలా దినుసులను వినియోగిస్తారు. కొన్ని సమయాలలో మటన్ కీమాను కూడా వాడతారు. సుమారు ఐదారు గంటలు బాగా మరిగించి ఘుమ ఘుమలాడే గంజిని సిద్ధం చేస్తారు.

ముప్పైఏళ్లుగా తయారు చేస్తున్నా..



రంజాన్‌మాసం వచ్చిందంటే ఎంతో ఇష్టంగా గంజిని తయారు చేస్తాను.. ముప్పైఏళ్లుగా ఈ వంటకం చేస్తున్నాను. సత్తుపల్లి మసీద్ గంజి సుమారు 1,000 మంది వరకు సేవిస్తారు. ఇళ్లకు తీసుకెళ్తారు. ముస్లిమేతరు ఎంతో ఇష్టంగా సేవిస్తారు.

– ఎస్‌కే యాకూబ్ అలీ, సత్తుపల్లి

ఎంతో ఇష్టం..



ఉపవాస దీక్ష విరమణ సమయంలో గంజి తాగటం నాకు ఎంతో ఇష్టం. వేడివేడి గంజిలో బూందీకలుపుకొని తాగితే రుచికరంగా, అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇంట్లోవారి కోసం గంజిని తీసుకెళ్తాను.

– ఎండీ మగ్బుల్, సత్తుపల్లి

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అగ్నిప్రమాదంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మధిర: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని మధిర అగ్నిమాపక కేంద్ర అధికారి వై.వెంకటేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మధిర పట్టణంలోని ఆర్‌వీ కాంప్లెక్స్ వద్ద అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రజల్లో చైతన్యం వస్తేనే అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పూర్తిస్థాయిలో కాపాడవచ్చన్నారు. ఆయిల్, గ్యాస్, ఎలక్ట్రికల్ ఫైర్ జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాంబాబు, శ్రీను, భాస్కర్ రావు, సతీష్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బూరి సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్, తదితరులు

మధిర: ఆత్కూరు గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్ అబ్బూరి రామకృష్ణ అందించిన సేవలు మరువలేనివని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు తెలిపారు. ఆత్కూరు గ్రామంలో శనివారం అబ్బూరి రామకృష్ణ ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రామకృష్ణ ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. అనంతరం ఆయన సతీమణి, గ్రామ సర్పంచ్ అబ్బూరి సంధ్యారాణి, కుమారులు పవన్, రామన్ లను పరామర్శించి వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కనుమూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, తాళ్లూరి హరీష్ బాబు, కూనా నరేందర్ రెడ్డి, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి

వైరా రూరల్/కొణిజర్ల: మొక్కజొన్నల కొనుగోలుకు వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా కేంద్రాలు ఏర్పాటుచేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా సహాయ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు డిమాండ్ చేశారు. వైరా మండలంలోని పలు గ్రామాలతోపాటు కొణిజర్ల మండలం పల్లిపాడు తదితర గ్రామాల్లో మొక్కజొన్నకల్లాలను శనివారం వారు పరిశీలించి మాట్లాడారు. ప్రైవేట్ వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నందున రైతులను ఆదుకునేలా మార్క్‌ఫెడ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమాల్లో నాయకులు తోట నాగేశ్వరరావు, వనమా చిన్న సత్యనారాయణ, బొంతు సమత, కిలారు శ్రీనివాసరావు, తూము సుధాకర్, రమణ, జయరాజ్, బాబురావు, పుష్పారాజ్యం, నాగరాజు, మజీద్, రామకృష్ణ, సంక్రాంతి నరసయ్య, పారుపల్లి శ్రీనాథ్‌బాబు, గోరింట్ల పిచ్చారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

చింతకాని: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాగులవంచ గ్రామంలో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలివేంద్రాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, మండల అధ్యక్షుడు వీరప్రసాద్, యువమోర్చా మండల అధ్యక్షుడు గోపి, మధిర పట్టణ అధ్యక్షుడు రమేష్, జిల్లా నాయకుడు స్వర్ణకర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు నాగరాజు, యువమోర్చా ఉపాధ్యక్షులు సత్యమూర్తి, నాగరాజు, వేణు, ఏపీజీవీబీ, డీసీసీబీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ముస్లింలకు భోజనం పెడుతున్న డాక్టర్ మట్టా దయానంద్

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ మసీద్‌లో శనివారం రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు డాక్టర్ మట్టా దయానంద్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముందుగా నమాజ్‌లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీ కమల్‌పాషా, యూనిస్, రహీం, సదర్ మీర్జా సర్దార్‌బేగం, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, పుసులూరి హనుమంతు, చిల్లగుళ్ల వెంకటేశ్వరరావు, జాని, అలవాల కరుణాకర్, ప్రభాకర్, జయరాజు, ఏసుపాదం పాల్గొన్నారు.

నేడు ముచ్చవరంలో బీఆర్ఎస్ సమ్మేళనం

కల్లూరు రూరల్: మండలంలోని ముచ్చవరంలో ఆదివారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు పాలెపు రామారావు తెలిపారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొంటారని తెలిపారు. దీనికి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

స్టేడియం ప్రారంభోత్సవానికి మంత్రికి ఆహ్వానం



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసిన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో జరగనున్న ఆత్మీయ సమ్మేళనాలలో భాగంగా వేంసూరులో జరిగే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం, కల్లూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన స్టేడియం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాల శాఖామంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌ను ఎమ్మెల్యే సండ్ర వెంటవీరయ్య ఆహ్వానించారు. శనివారం హైద్రాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వానం పలికారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీరా పాలసీలో భాగంగా నీరా ప్రాసెసింగ్, బాటిలింగ్‌లపై అధికారులతో మంత్రి నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టూరిజం ఎండీ మనోహర్, ఎక్సైజ్ ఉన్నతాధికారులు డేవిడ్, రవికాంత్, దత్తరాజ్‌గౌడ్, చంద్రయ్య, ఈఎస్‌లు సత్యనారాయణ, రవీంద్రరావు, అరుణ్‌కుమార్, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందించకపోతే సమ్మె చేస్తాం



చింతకాని: ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న జేపీఎస్‌లు

పెనుబల్లి/చింతకాని/ఎర్రుపాలెం/వేంసూరు/కల్లూరురూరల్: నాలుగు సంవత్సరాల కాంట్రాక్ట్ పిరియడ్ పూర్తైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం అధికారులకు వినతులు అందించారు. ఈ మేరకు పెనుబల్లిలో ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మి, ఎంపీఈఓ వాల్మికీ కిషోర్, తహసీల్దార్ ఎం.రమాదేవిలకు, చింతకానిలో ఎంపీడీఓ శ్రీనివా సరావుకు, ఎర్రుపాలెంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ తిరుమలాచారీలకు, కల్లూరులోని తహసీల్దార్ బాబ్జిప్రసాద్, ఎంపీడీఓ రవికుమార్, ఎంపీఓ వీరస్వామిలకు, వేంసూరులోని ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్, ఎంపీఓ లకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా కాంట్రాక్ట్ పూర్తైనప్పటికీ ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయకపోవడంతో ఈ నెల 28 నుంచి విధులకు గైర్హాజరై సమ్మె నిర్వహిస్తామని సమ్మె నోటీసులో తెలిపారు. తమను వెంటనే రెగ్యులర్ చేయాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాలల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చెన్నారావు, చంద్రవర్తి, వెంకటరామిరెడ్డి, నరసింహారావు, లక్ష్మణ్, సౌజన్య, ఇందిర, సుష్మిత, భావన, అనూష, షేక్ సైదులు, చెవుల మహేష్, వినోద్‌కుమార్, బాబురావు, రాజేష్, శ్రీరామ్‌కుమార్, నిఖిల్, మురళీ, విజయరామారావు, రాధాకృష్ణ, ఈశ్వరాచారి, రాధిక, జయశ్రీ, ప్రణిత, సీత, వరికూటి సురేష్, శ్రీనివాసరావు, హారతి, రామకృష్ణారెడ్డి, తిరుపతిరావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల రద్దుకు కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సత్తుపల్లిరూరల్: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించటంలో పాలకులు విఫలం కాగా, ఉపాధిహామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. సత్తుపల్లిలోని గుడిపాడులో శనివారం ఏర్పాటు చేసిన ఏఐపీకేఎస్, ఏఐపీకేఎంఎస్ కల్లూరు డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ కారణంగా ఇప్పటికే పనులు లేనందున, ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐపీకేఎస్ అధ్యక్ష, కార్యదర్శులుగా కట్ల ప్రసాద్, ఒగ్గు నాగిరెడ్డి, ఏఐపీకేఎంఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కట్ల ప్రసాద్, ఒగ్గు నాగిరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆర్.శివలింగం, బి.వెంకన్న, వెంకటేష్, తాటి రాజు, కేశవరావు, నాగేష్, గంట నారాయణ, విశ్వానాథం, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇప్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఖాసీం

కొణిజర్ల: మల్టీ నేషన్ కంపెనీ విత్తనాలు కొనుగోలు చేసి సరైన దిగుబడి రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు సదరు కంపెనీ ప్రతినిధులు నష్టపరిహారం ఇప్పించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు షేక్ ఖాసీం డిమాండ్ చేశారు. శనివారం ఏఐకేఎంఎస్ మండల కమిటీ సమావేశం గుబ్బగుర్తిలో రొంటె గంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక దిగుబడుల పేరుతో రైతులను మోసం చేసి అంట గట్టిన ప్రతినిధులు ఇప్పుడు దిగుబడి రాక పోవడంతో ముఖం చాటేశారన్నారు. ఎకరానికి 10 నుంచి 25 క్వింటాళ్ల దిగబడి మాత్రమే రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తక్షణమే సదరు కంపెనీ ప్రతినిధులు పంటలు పరిశీలించి రైతులకు పరిహారం ఇప్పించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ నెల 22న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి పఠాన్ ఖాసీమ్ ఖాన్, నాయకులు గుగులోత్ బాబు, మంగపతి, లచ్చన్న, పాల్గొన్నారు.

సొసైటీ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుమారుడికి నగదు అందజేస్తున్న సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల గ్రామానికి చెందిన ఎర్రుపాలెం సొసైటీ ఉద్యోగి(క్లర్క్) నాగిరెడ్డి నాగేశ్వరరావు(52) శుక్రవారం మృతి చెందగా కుటుంబ సభ్యులు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహానికి మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, డీసీసీబీ మేనేజర్ మగినం వీరభద్రం, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ చెన్నంరాజు పురుషోత్తంరాజు, ఎంపీటీసీ అప్పమ్మ, సాంబశివరావు తదితరులు సందర్శించి నివాళి అర్పించారు. మృతుని దహన సంస్కారాల నిమిత్తం సొసైటీ నుంచి రూ.15వేలు, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు సొంత నగదు రూ.10వేలు మృతుని కుమారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గుంతల రోడ్డే గతి





అధ్వానంగా మారిన ఎర్రుపాలెం – తెల్లపాలెం బీటీ రోడ్డు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ నుంచి తెల్లపాలెం వరకు 2 కి.మీ పొడువునా గుంతల రోడ్డు దర్శనమిస్తుంది. అడుగుకొక గుంతతో ప్రయాణం నరక యాతనగా ఉంది. బీటీ లేచిపోయి రాళ్ళు కనిపిస్తున్నాయి. ఈ రోడ్డేసి దశాబ్దకాలం దాటినప్పటికీ పట్టించుకున్న నాధుడే కరవయ్యారని రెండు గ్రామాల ప్రజలు, వాహన చోదకులు వాపోతున్నారు. నిత్యం ఈ రహదారి గుండానే ఏపీలోని కంచికచర్ల, గంగినేని విజయవాడ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు కంద్రిక మీదుగా తెలంగాణ తిరుపతి, జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రయాణిస్తుంటారు. పలువురు వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించి గాయాలపాలైన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఈరోడ్డుపై మార్జిన్ లేకుండా, తారుమొత్తం లేచి, గాడులు ఏర్పడి ప్రమాదకరంగా తయారైంది. అంతే కాకుండా అనధికార స్పీడు బ్రేకర్లు చాలా ఎత్తుగా ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో మోకాళ్లలోతులో నీళ్ల నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయి. తెల్లపాలెం, ఎర్రుపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు పలుమార్లు ఈ రోడ్డుకు మరమ్మతులు, విస్తరణ చేయాలని కోరుతూ పాలకులకు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కనీసం ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని గ్రామ ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

అధికారులకు విన్నవించాం..



రోడ్డు బాగు చేయాలని కోరుతూ ఇప్పటికే పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు విన్నవించాం. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.

– పెరుగు రామకృష్ణ, సర్పంచ్, తెల్లపాలెం

ప్రయాణం నరకమే..



మండలకేంద్రం నుంచి తెల్లపాలెం గ్రామానికి వెళ్లాలంటే భయమేస్తుంది. ఈ రోడ్డులో మోటారు సైకిళ్లపై ప్రయాణం నరకయాతనగా ఉంటుంది. వర్షం కురిసినప్పుడు మరీ కష్టతరంగా ఉంటుంది.

– దూదిగం బసవయ్య, ఎర్రుపాలెం

నిధులు మంజూరయ్యాయి..



ఎర్రుపాలెం టూ తెల్లపాలెం రోడ్డు మరమ్మతులకు సుమారు రూ.80లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రాసెస్‌లో ఉంది. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం.

– రాజేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ